క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో ఆండాళ్ తిరునక్షత్ర వేడుకలు

సిరిసిల్లటౌన్: ఆండాళ్ దేవి తిరునక్షత్ర వేడుకలను సిరిసిల్లలో ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ విశలేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక పారాయణం, అభిషేకాలు, సామూహిక అర్చనలు నిర్వహించారు. భక్తుల తాకిడితో వైష్ణవాలయాలు కిటకిటలాడాయి.

సెస్ రూరల్ ఏఈగా నగేశ్ కుమార్

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండల సెస్ ఏఈగా రంగు నగేశ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రిషిక బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో బోయినపల్లిలో పనిచేసిన నగేశ్‌కుమార్ వేములవాడరూరల్ సెస్ ఏఈగా బాధ్యతలు తీసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. నాగెల్లి అపర్ణకు రూ.60వేలు, కె.అంజిరెడ్డికి రూ.27వేలు, గౌరీ లతకు రూ.17వేలు, టి.శైలజకు రూ.8 వేలు, యారటి బంతికి రూ.32వేల విలువైన చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నిమ్మ దేవిరెడ్డి, గౌరి సురేశ్, యారటి కరుణాకర్, మంద బాల్‌రెడ్డి, నిరంజన్, బాలరాజు, మనోహర్, బాబు పాల్గొన్నారు.

'మా నాయకుడు కేటీఆర్'


సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్: కొద్ది రోజులుగా పట్టణ బీఆర్ఎస్ నాయకులు అలక బూనారు. పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని 15 రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. తమ నాయకుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని స్పష్టం చేశారు. ఆయనకు భారీ మెజార్టీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నామినేటెడ్ పోస్టుల విషయంలో ముస్తాబాద్ పట్టణ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానం చేశారు. 70 మంది వరకు సమావేశమై, పార్టీ పనుల విషయంలో ఇతర గ్రామాల వారి జోక్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. పట్టణ బీఆర్ఎస్ నాయకుల ఐక్యత సమావేశం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు తీర్మానం ప్రతిని పంపించారు. సర్పంచ్ గాండ్ల సుమతి, ఉపసర్పంచ్ రవీందర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ పట్టణాధ్యక్షుడు సంతోష్‌రావు, భరత్, మాజీ సర్పంచులు రమణారెడ్డి, నల్లనర్సయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, ఎల్సాని దేవయ్య, షాదుల్, రాజు, దేవేందర్, శేరయ్య, మట్టరాణి తదితరులున్నారు.

బూత్ కమిటీ నియామకాలు పూర్తి చేయండి

ముస్తాబాద్ : బూత్ కమిటీల నియామకాలను సకాలంలో పూర్తి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులు, ఉచిత 24 గంటల కరెంట్, రుణమాఫీ, దళితబంధు, రైతుబంధు వంటి పథకాల గురించి వివరించాలన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ ఎంపీటీసీ దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీనివాస్, మనోహర్, స్వామి, అన్వర్, నర్సింలు, జహంగీర్, సాయిలు ఉన్నారు.

పండ్లతోటల పెంపకంతో లాభాలు

బోయినపల్లి: పండ్లతోటల పెంపకంతో లాభాలు సాధించవచ్చని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంటుకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజేందర్ రెడ్డి, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ఈ జీఎస్ ఏపీవో వనం సబిత, ఎంఏవో ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌కు పోలీస్‌స్టేషన్

వీర్నపల్లి: మండల ఏర్పాటు నుంచి పాత గ్రామపంచాయతీ భవనంలో పోలీస్‌స్టేషన్ కొనసాగింది. అరకొర వసతులతో ఇన్ని రోజులు కొనసాగించగా ఇబ్బందులను ఎస్సై నవత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి కొత్త భవనం నిర్మాణమయ్యేవంత వరకు ఫారెస్ట్ గెస్టహౌస్‌లోనే పోలీస్‌స్టేషన్ కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. మండల ప్రజలు సేవలు వినియోగించుకోవాలని ఎస్సై నవత కోరారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న రెయిన్ కోట్లు


పలురకాల మోడళ్లలో గొడుగులు



ఆకట్టుకుంటున్న అంబ్రెల్లాలు



సండే స్పెషల్

- వర్షం నుంచి రక్షణ..
- మార్కెట్‌లో లభ్యమవుతున్న రకరకాల గొడుగులు, రెయిన్ కోట్లు
- పెరుగుతున్న అమ్మకాలు
- అందుబాటులో ధరల్లో లభ్యం

సిరిసిల్లఅర్బన్: 'గొడుగు' ఎండ, వాన నుంచి రక్షిస్తుంది. మొదటగా గొడుగులను ఎండనుంచి రక్షణ కోసం వాడేవారు. రానురాను వానలో తడవకుండా కాపాడుకునేందుకు వినియోగిస్తున్నారు. దాదాపు 400 ఏళ్లక్రితం నుంచే గొడుగులు వాడకంలో ఉన్నట్లు చరిత్ర తెలుపుతుంది. ఒక్కప్పుడు నలుపు రంగులో ఉండే గొడుగులు ఇప్పుడు రంగురంగుల్లో లభ్యమవుతుండగా జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

వర్షాకాలంలో బయటకు వెళ్లాలంటే గొడుగు ఉండాల్సిందే. ప్రస్తుతం ఎక్కడ చూసినా గొడుగులే దర్శనమిస్తున్నాయి. ఉద్యోగులు, విద్యార్థులు, తదితర పనులు అవసరాల కోసం బయటకు వెళ్లేవారు వాన నుంచి రక్షణ కోసం గొడుగులు, రెయిన్ కోట్లను వినియోగిస్తున్నారు. వర్షం నుంచి రక్షణతో పాటు ఆకర్షణీయంగా ఉండే గొడుగులను వాడేందుకు ప్రజలు ఇష్టపడుతుండగా వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగానే మార్కెట్‌లో రంగుల రంగుల గొడుగులు లభ్యమవుతున్నాయి. రకరకాల డిజైన్లు, కలర్లు, పలు బొమ్మలతో కూడిన గొడుగులు మార్కెట్‌లో అందుబాటులో దొరుకుతున్నాయి.

పెరగుతున్న అమ్మకాలు

వర్షాకాలం నేపథ్యంలో గొడుగుల అమ్మకాలు పెరగుతున్నాయి. ఐదు రోజుల నుంచి ముసురు అందుకోవడంతో మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు డిమాండ్ పెరిగింది. పలుషాపుల్లో విభిన్న రకాల గొడుగులను అందుబాటులో ఉంచారు. పెద్దవారికి, చిన్నవారికి సరితూగే మోడళ్లు తెచ్చి విక్రయిస్తున్నారు. రంగు రంగులు, ఆకట్టుకునే విధంగా ఉండడంతో కొనేందుకు ఇష్టపడుతున్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్, పెద్దబజార్, బస్టాండ్ ఏరియాల్లో పలు జనరల్ స్టోర్స్‌లలో గొడుగుల విక్రయాలు జోరందుకుంటున్నాయి.

అందుబాటు ధరల్లో

మార్కెట్‌లో లభ్యమవుతున్న గొడుగులకు అన్నివర్గాల ప్రజలకు అందుబాటు ధరలో లభిస్తున్నాయి. సైజు, కలర్లను బట్టి ధరలు ఉన్నాయి. పెద్దవారికి మాములు గొడుగులను కొనుగోలు చేస్తే, విద్యార్థులు కాస్త మల్టీకలర్స్ బొమ్మలతో చిన్న సైజులతో ఉన్న అంబ్రెల్లాలను కొనేందుకు ఇష్టపడుతున్నారు. చైనా, ఇండియన్ మోడళ్లలో గొడుగులు లభ్యమవుతున్నాయి. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా రూ.150 నుంచి రూ.450 వరకు మోడళ్లు బట్టి అమ్ముతున్నారు.

పలు మోడళ్లలో రెయిన్ కోట్లు

రెయిన్ కోట్లకు కూడా గిరాకీ పెరిగింది. కస్టమర్లను ఆకట్టుకునేందుకు వివిధ మోడళ్లు, కలర్లలో రకరకాల డిజైన్లలో రెయిన్ కోట్లు లభిస్తున్నాయి. ఢిల్లీ, మహారాష్ట్ర నుంచి రెయిన్ కోట్లను దిగుమతి చేసుకుంటూ విక్రయిస్తున్నారు. రూ.500 నుంచి మొదలు కొని మన్నికను బట్టి ధరలు ఉన్నాయి.

కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా



వినియోగదారులకు అభిరుచులకు తగ్గట్టుగా పలురకాల మోడళ్లలో రెయిన్‌కోట్లు ఢిల్లీ, హైదరాబాద్, మహారాష్ట్ర తదితర ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకుంటాం. వర్షాలు ప్రారంభంకావడంతో ఇప్పుడిప్పుడే అమ్మకాలు సాగుతున్నాయి.
– శ్రీరామ్ శ్రీనివాస్, వ్యాపారస్తుడు, సిరిసిల్ల

అమ్మకాలు పెరుగుతున్నాయి



వర్షానికి తడవకుండా ఉండడంతో పాటు ఆకర్షణీయంగా ఉండేందుకు వినియోగదారులు ఆలోచిస్తున్నారు. వారి అభిరుచులకు తగ్గట్టుగానే పలురకాల మోడళ్లలో గొడుగులను తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. మల్టీకలర్, బొమ్మలతో కూడిన గొడుగులను ఇష్టపడుతున్నారు. ఐదు రోజుల నుంచి వర్షాలు కురవడంతో ప్రస్తుతం గిరాకీ పెరిగింది.
– పసుల వేణు, దుకాణదారుడు, సిరిసిల్ల

ప్రత్యేకమైన డిజైన్లలో..



ఒకప్పుడు గొడుగులు అంటే కేవలం నలుపు రంగులో మాత్రమే ఉండేవి. ప్రస్తుతం రంగురంగుల్లో లభిస్తున్నాయి. పెద్దలకు, చిన్నపిల్లలకు ప్రత్యేకమైన డిజైన్లలో మార్కెట్‌లో కనువిందు చేస్తున్నాయి. కేవలం వాన నుంచి రక్షణకే కాకుండా ఆకర్షణీయంగా ఉన్నాయి. అందుబాటు ధరల్లోనే లభ్యమవుతున్నాయి.
– ముత్యం, కొనుగోలుదారుడు

వేములవాడ రూరల్ ఎస్సైగా మారుతి



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ ఎస్సైగా మిలుకురి మారుతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై నాగరాజును హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేయగా సిరిసిల్ల సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న మారుతి బదిలీపై వేములవాడ రూరల్‌కు వచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు.

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

వీర్నపల్లి : 18 ఏళ్లు నిండిన యువత ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ అన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రజలకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సంచార వాహనంలో ఎన్నికల్లో ఈవీఎంలో ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. శ్రీనివాస్, బాలకిషన్, ఆంజనేయులు, కానిస్టేబుల్ సాంబయ్య, ఆర్ఐ ప్రవీణ్ కుమార్ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టాలు అందజేత

వేములవాడ అర్బన్: మిడ్ మానేరు సంకెపల్లి ముంపు గ్రామ నిర్వాసితులకు పెండింగ్‌లో ఇళ్ల స్థలాల పట్టాలను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, తహసీల్దార్ రాజు, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, ఏఎంసీ డైరెక్టర్ బండారి శ్రీనివాస్, బూర బాబు, రెడ్డవేణి పర్శరాములు, మచ్చ బుచ్చయ్య, శ్రీధర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ : జీపీ కార్మికుల కష్టాలు తొలగించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తెలంగాణచౌక్‌లో కార్మికులకు శనివారం అన్నదానం చేశారు. వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. నాయకులు వకులాభరణం శ్రీనివాస్, కరుణాకర్, భాను తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైపు లీకేజీ

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారి పక్కన పోలీస్‌స్టేషన్ ఆవరణలో మిషన్ భగీరథ పైపు లీకై రోడ్డుపై నీరు వృథాగా పోయింది. సుమారు గంట పాటు పైపు లీకేజీ కావడంతో రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. త్వరగా నీటి లీకేజీని ఆపి, రోడ్డును బాగు చేయాలని ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


ముస్తాబాద్‌లో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

సిరిసిల్లటౌన్: జీపీ కార్మికులపై రాష్ట్ర సర్కారు చిన్న చూపు చూస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సర్కారు తీరుపై ఈనెల 26న మండల కేంద్రాల్లో ఆందోళనలు, 27న కార్మికుల కుటుంబ సభ్యులతో సహా జిల్లా కలెక్టరేట్ల ముట్టడి చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ తమ సమస్యలను పరిష్కరించాలని కొరుతూ మండలకేంద్రంలో పంచాయతీ కార్మికులు పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. జల్లి లక్ష్మణ, పోషరాములు, సుధాకర్, అబ్రమేని లక్ష్మణ్, రాములు, నర్సయ్య, లక్ష్మి, మల్లవ్వ తదితరులున్నారు.

మండల పరిషత్ కార్యాలయం ముట్టడి..

చందుర్తి : తమ డిమాండ్లను పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయాన్ని గ్రామపంచాయతీ కార్మికులు ముట్టడించారు. ఎంపీపీ బైరగోని లావణ్య వారి సమస్యలను తెలుసుకున్నారు. చందుర్తి , రుద్రంగి మండలాలకు చెందిన జీపీ కార్మికులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఊరేగింపు చేపట్టి అంబేద్కర్ చౌరస్తాలో తమ నిరసన తెలిపారు. అనంతరం భిక్షాటన చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, మండల జీపీ కార్మికులు ఉన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు కోనరావుపేటలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. అన్ని గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. అంతకుముందు కార్మికులు మోకాళ్లపై నిరసన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

✦ సభను విజయవంతం చేయాలి

కోనరావుపేట: ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే డ్రైవర్ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాస రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు కాశీరాం, గొట్టె రవి, పొలు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ బాపురెడ్డి పాల్గొన్నారు.

✦ పోస్టర్ల ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను శనివారం జిల్లా రవాణా శాఖాధికారి కొండల్‌రావు ఆవిష్కరించారు. ఈనెల 25న పెద్దపల్లిలో జరిగే సభకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని డీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాసం రత్నాకర్ కోరారు. కనుకుల అనంతరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పడిగెల రాజు, జగదీశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

✦ నియామకం

తంగళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన అంకారపు మహేశ్ తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక కార్య నిర్వాహక అధ్యక్షుడిగా శనివారం నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ నియామక పత్రం అందజేశారు.

✦ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రుద్రంగి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మానాలలో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగంపై వైస్ ఎంపీపీ, అధికారులు గ్రామంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు.

✦ సామాజిక తనిఖీ ప్రారంభం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ రాఘవులు ఆధ్వర్యంలో 15 మంది డీఆర్‌పీల టీమ్‌తో సామాజిక తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

✦ పరామర్శ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పాపయ్యపల్లె సర్పంచ్ నక్క రేవతి భర్త కొమురయ్య నాలుగు రోజుల క్రితం తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమురయ్యను శనివారం జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల రావు, మాజీ సర్పంచ్ అంకారపు రవి, బీఆర్ఎస్ నాయకులు సురభి నవీన్ రావు, భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

✦ పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

తంగళ్లపల్లి: వర్షాకాలంలో గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, గోపాలరావుపల్లె, తాడూర్ గ్రామ పంచాయతీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు కృష్ణయ్య, కవిత, వాణి, సంతోష్ పాల్గొన్నారు.

✦ భక్తిశ్రద్ధలతో పారాయణం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఆండాలోత్సవంలో భాగంగా పారాయణం నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలచారి, నవీన్‌చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, సభ్యులు మేగి నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు


కోరెంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రవిశంకర్, జోగినపల్లి రవీందర్‌రావు, తదితరులు

ఇల్లంతకుంట/ వేములవాడ/వేములవాడ రూరల్/ బోయి నపల్లి/ ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కోరెంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావుతో పాటు పలు మండలాల్లో మొక్కలు నాటారు. ఆయా కార్యక్ర మాల్లో మండలాధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దాశరథికి నివాళి

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ కవి సింహం దాశరథి కృష్ణమాచార్యులు భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం, సాయుధ పోరాటంలో పాల్గొనడంతోపాటు తన కలంతో ప్రజలను చైతన్యవంతం చేశారని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వాసరవేణి పరుశరాం కొనియాడారు. ఎల్లారెడ్డిపేటలో దాశరథి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రచయితల సంఘం మండల కన్వీనర్ రమేశ్, అజయ్, కృష్ణ, మహమ్మద్ దస్తగిర్, పద్మారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు'

సిరిసిల్లఅర్బన్: బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, అజయ్, రాకేశ్, రంజిత్, వంశీ,రాజు, తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎల్లారెడ్డిపేట: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సామాజిక కార్యకర్త దుంపెన రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు.

హరితహారం మొక్కలు పంపిణీ

గంభీరావుపేట: మండలంలోని భీముని మల్లారెడ్డి పేట ఐకేపీ అధికారులు, సిబ్బంది ఇంటింటా హరితహారం మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు.

చీర్లవంచ, కొడుముంజలో..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని చీర్లవంచ, కొడుముంజ గ్రామాల్లో హరితహారంలో భాగంగా శనివారం ఇంటింటా పూల, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె రాజ్‌కుమార్, రంగు సత్తెమ్మ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఇల్లంతకుంట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఏపీఓ వాణి శ్రీ అన్నారు. గాలిపల్లిలో మహిళా సంఘాల సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యదర్శి అనిల్, తదితరులున్నారు.

ధాన్యం సంచుల కోతలపై లెక్క చెప్తేనే సభ

- మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసిన సభ్యులు


ఎంపీపీని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ గణేశ్

చందుర్తి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అడ్డగోలుగా సంచుల కొద్దీ కోతలు విధించారని, దీనికి కారణాలు చెప్పి మండల సభను కొనసాగించాలని, లేదంటే మండల సర్వసభ్య సమావేశాన్ని లెక్కలు చెప్పేంత వరకు వాయిదా వేయాలని సభ్యులు వాగ్వాదానికి దిగారు. మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం సమావేశ మందిరంలో నిర్వహించారు. నాలుగేళ్లుగా సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన ఏ సమస్యను పరిష్కరించలేదని ఎంపీపీ లావణ్యను ప్రశ్నించారు. 120 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు ఉంటే , 60 మంది విద్యార్థులు ఉన్న చోట ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. సింగిల్ విండో చెర్మన్లు మండల సభకు హాజరై ధాన్యం సంచుల కోతలపై వివరణ ఇవ్వాలన్నారు. ఒక్కో రైతుకు సంబంధించిన ధాన్యం సంచుల్లో 20 నుంచి 40 బస్తాల వరకు కట్ చేశారన్నారు. సింగిల్ విండో చైర్మన్లు సమాధానం చెప్పేంతవరకు సభను వాయిదా వేయాలని బండపల్లి, జోగాపూర్ ఎంపీటీసీ సభ్యులు గడ్డం రణధీర్ రెడ్డి, మ్యాకల గణేశ్, ఎంపీటీసీ ఫోరం కన్వీనర్ మాదాసు వేణులు డిమాండ్ చేయగా ఎన్గల్, ఆశిరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు మాదాని కవిత , వెల్పుల వనజ, సర్పంచ్‌లు అయిల్నేని కమలాకర్‌రావు, నేతికుంట జలపతి సభను వాయిదా వేయాలని డిమాండ్ చేసి సభనుంచి వాకౌట్ చేశారు. ఎంపీడీఓ రవీందర్, మండల కో ఆప్షన్ సభ్యులు కమలాకర్, అన్నిశాఖల అ ధికారులు, పలుగ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌కోట్ల పంపిణీ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని గోదావరి అర్బన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం చిరువ్యాపారులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటల్లో కూరగాయలు విక్రయించుకునే ఐదుగురికి, గ్రామపంచాయతీ చెత్త సేకరించే ట్రాక్టర్ డ్రైవర్‌కు, మరో ఇద్దరు టీ విక్రయించే వారికి రెయిన్ కోట్లు అందించినట్లు బ్యాంక్ మేనేజర్ నిమ్మ నారాయణరెడ్డి తెలిపారు. మరికొందరిని గుర్తించి బ్యాంక్ తరఫున రెయిన్‌కోట్లు అందిస్తామని తెలిపారు. బ్యాంకు డైరెక్టర్లు ధర్మారావు, వనం రమేశ్, గాలిపల్లి రమేశ్, సంతోష్, కృష్ణవేణి, విజయ్ పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంకు చైర్మన్‌ను తొలగించాలి

సిరిసిల్లటౌన్: సహకార అర్బన్‌బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణకు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు నిర్ధారణ అయినందున వెంటనే పదవి నుంచి తప్పించాలని పౌర సంక్షేమ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేసి మాట్లాడారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రస్తుత చైర్మన్ ముగ్గురు పిల్లలున్నా పోటీచేసి ఎన్నికల అధికారులు, నియమావళిని తప్పుదోవ పట్టించారన్నారు. ఈవిషయమై చాలా రోజుల క్రితమే ఫిర్యాదు చేయగా..విచారణ అధికారిని నియమించాలని సదరు అధికారి కూడా చైర్మన్ పదవికి నారాయణ అనర్హుడిగా రిపోర్టు ఇచ్చినట్లు వెల్లడించారు. వెంటనే అర్బన్‌బ్యాంకు చైర్మన్ పదవి నుంచి తప్పించి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. సమితి ప్రతినిధులు కుసుమ గణేష్, చిప్ప దేవదాసు, పెంట ప్రకాశ్, తిప్పవరపు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.